

# నేనే నా ఆయుధం

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



## సామాన్యుడి అసామాన్య విజయం.. ఒక యదార్థ గాథ!

"ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చున్నప్పుడు...
కాకినాడలో పోస్టర్లు అతికించటానికి వాడగా మిగిలిపోయిన మైదా పిండితో
చపాతీలు కాల్చుకుని తిన్న రోజులు గుర్తొచ్చి కళ్ళ నీళ్ళొచ్చాయి".

వ్యాపారంలో పోటీ... ఎత్తులు – పైఎత్తులు...
విస్తరించటానికి చేసే ప్రయత్నాలు... ఎక్కే శిఖరాలు, పడే లోయలూ...
ఆర్టీసీ బల్లల మీద నిద్ర... సులభ్ కాంప్లెక్స్‌లలో స్నానం..!
పదో క్లాసు ఫెయిల్ నుంచి... డాక్టరేట్ వరకూ..!

అట్టడుగు స్థాయి నుంచి లక్షల సంపాదన వరకూ ఎదిగిన
ఒక నిరుద్యోగి జీవిత చరిత్ర...!
ప్రతీ నిరుద్యోగీ, వ్యాపారవేత్తా, జీవితంలో పైకి రావాలనే తపన ఉన్న
ప్రతి వ్యక్తీ చదవవలసిన పుస్తకం.

మాస్టర్ రైటర్
**యండమూరి వీరేంద్రనాథ్** కలం నుంచి...

## *వీడు మగాడ్రా బుజ్జీ... !*

– తనికెళ్ళ భరణి

ఒక అద్భుతం ఆవిష్కరించబడింది!!
ఒక Adventure Film చూస్తున్నట్టు...
అప్పట్లో 'మెగాస్టార్' సినిమా చూస్తోంటే కలిగే ఉద్వేగం... ఉత్సాహం...
ఇది రాసింది యండమూరి వీరేంద్రనాథ్. అతను మనకి బాగా తెలిసిన విషయాన్ని కూడా... కొత్తగా వింటున్నట్టూ... చూస్తున్నట్టూ... చెప్పగల సమర్థుడు!.
కానీ అతను రాయడానికి కూడా... గట్టి వస్తువు దొరకాలి కదా.
నాకు తెలిసి ఇది అతడు రాసిన రెండో జీవిత చరిత్ర.
మొదటిది... 'ఇడ్లీ వడ ఆకాశం' కామత్‌ది. రెండోది... చిరంజీవిది..!
నన్ను అబ్బురపరిచిన జీవిత చరిత్రల్లో

***చార్లీచాప్లీన్... మర్లిన్ మన్రో...***
***శ్రీపాదవారి అనుభవాలు జ్ఞాపకాలూనూ***
***తిరుమల రామచంద్ర గారి హంపీ నుంచి హరప్పా దాకా***
***దాశరథి రంగాచార్య గారి నా జీవనయానం..***

ఆ స్థాయిలో ఉన్నాయ్ ఈ కథలో కథానాయకుడి కష్టాలు..!
ఎవరికైనా చచ్చిపోదామనిపిస్తుంది..!
ఆ స్థితిలోంచి బైట పడ్డవాడే 'చిరంజీవి' అవుతాడు..
ఇంగ్లీషు..! ఇది చాలామందిని భయపెట్టే 'శ్వేత భూతం'.
ఆరంభంలో నిర్లక్ష్యం చేసామా... ఆ తరువాత జీవితాంతం పట్టి పీడిస్తుంది!!
ఇంగ్లీషు కొంచెమే వచ్చిన ఓ పెద్ద డైరెక్టర్ ఉండేవాడు. ఎవరన్నా బొంబే హీరోయిన్ వచ్చిందంటే చాలు వణికిపోయేవాడు. ఇంగ్లీష్‌లో మాట్లాడాల్సి వొస్తుందని...! బిజీగా ఉన్నట్టు నటిస్తూ, అసిస్టెంట్ డైరెక్టర్ని పంపేవాడు. రోజంతా బెంగగా ఉండేవాడు. అంచేత సీన్లమీద దృష్టి పెట్టలేక పోయేవాడు!!..

...ఇవాళ మీకిష్టం ఉన్నా లేకపోయినా... దానితో కాపురం చెయ్యక తప్పని 'దొరసాని' ఇంగ్లీషు ! ఆవిడకి దాస్యం చేసే బదులు... అధికారం చెలాయించొచ్చన్నది చిరంజీవి గారి 'మేధ' స్సులోంచి పుట్టిన ఆలోచన..

తెలుగు మన మాతృభాష ! దాన్ని ఆస్వాదించండి !

ఇంగ్లీషు... బతుకు భాష ! దాని మీద  సాధికారత సంపాదించండి..!

ఒక సామాన్యుడు.. మాన్యుడై... ధన్యుడైన కథనం ఇది..!
చాలా లైన్లు కొటేషన్‌లలాగా ఉన్నాయ్..!
ఈ జీవితగాథ చదివితే.. మనకీ ధైర్యం వొస్తుంది..!
ఏదైనా సాధించాలన్న కోరిక కలుగుతుంది..!
చెప్పొద్దూ... నాకైతే... ఇంగ్లీషు మరికాస్త బాగా నేర్చుకుంటకు
మేధలో చేరితే బావుణ్ణేమో అనిపించింది..!
బలహీనులకి ఇది సంజీవిని.
ఇంగ్లీష్... నేర్చుకునేవాళ్ళకి టానిక్కు..
చిరంజీవి... చిరంజీవ!!

ఇష్టంగా

(20-12-2015)

# 5

నేను మొట్టమొదటి సారి మందు కొట్టటం చాలా గమ్మత్తుగా జరిగింది.

ఐదో తరగతితో చదువు మానేసిన మా చిన్న అన్నయ్య ఒక హొటల్లో పని చేసేవాడు. ఎలా దొరికిందో తెలీదు కానీ వాడికి ఒక మెక్ డొవెల్స్ విస్కీ బాటిల్ దొరికింది. దాన్ని తీసుకొచ్చాడు. అప్పటివరకూ సినిమాల్లో చూడటమే తప్ప మందు తాగటం తెలీదు.

రాత్రి అందరూ నిద్ర పోయాక బాటిల్ ఎత్తి కొంత తాగాను.

నాకేమీ అనిపించలేదు.

భగ్న ప్రేమికుడైన హీరో మందు కొట్టి సీసా పగలకొట్టటం, హీరోయిను కొబ్బరికాయలో రవ్వంత జిన్ను తాగి పిచ్చిపిచ్చిగా హీరోతో గెంతులెయ్యటం, రేప్ చేసే ముందు విలను కొంచెం తాగగానే విపరీతంగా ప్రవర్తించటం సినిమాల్లో చూసి, అలా ఏమీ జరగకపోవటంతో నరాల్లో సత్తువ ఎక్కువ ఉన్నదనుకొని మరింత తాగాను.

అలా అలా దాదాపు సగం బాటిల్ తాగేశాను.

మొదటి రెండు నిముషాలూ బానే ఉంది కానీ, క్రమక్రమంగా... ముందు మంచం, తరువాత గది, ఆ పైన నేనూ, నా చుట్టూ ప్రపంచం తిరగటం మొదలైంది.

పక్క మీద ఎలా పడ్డానో తెలీదు.

పొద్దున్న లేచే సరికి పక్కంతా వాంతులు.

వీపు మీద అమ్మ ప్రపంచపటం ముద్రిస్తుందని అనుకున్నాను కానీ కొట్టలేదు.

"కుక్కలాగా అలా తాగటమేంట్రా. తాగాలనుకుంటే కనీసం అన్నయ్యని చూసి నేర్చుకో" అంది.

ఆమె నన్ను తిట్టకపోవటం, కొట్టకపోవటం కుదించుకుపోయేలా చేసింది.

'ఆ రోజు నుంచీ ఈ రోజు వరకూ మందు కొట్టలేదు' అనను కానీ, వాంతి చేసుకునేటంతగా డ్రింక్ చెయ్యటం జరగలేదు.

...

అవసరమైన ఖర్చులకే తప్ప, చిన్నప్పటి నుంచీ నేను వేసే వేషాల ఖర్చులకి ఇతరుల నుంచి డబ్బులు తీసుకోవటం అలవాటు లేదు. కనీసం అమ్మని కూడా అడిగేవాడిని కాను (ఒకవేళ అడిగినా ఎవరూ ఇచ్చి ఉండేవారు కాదు. అది వేరే సంగతి).

ఒక రోజు స్కూల్‌కి వెళుతూండగా పొలాల మధ్యలో ఇటుక బట్టీలు చూసాను. పచ్చి ఇటుకల్ని వంద మోసుకెళ్ళి బట్టీలో పెడితే పది పైసలు ఇస్తారని తెలిసింది.

'అవసరం అన్వేషణకి అమ్మ' అని ఒక ఇంగ్లీషు సామెత ఉన్నది. మొట్టమొదటిసారి లేబర్ పని చేపట్టాను. మొదటి రోజు కూలీ ముప్పై పైసలు వచ్చింది. రెండో రోజు డెబ్బై పైసలు, మూడో రోజు దాదాపు ఒక రూపాయి వచ్చింది.

నాకు రింగులంటే చాలా ఇష్టం. పిండితో రకరకాల రింగులు తయారు చేస్తారు. వాటిని వేళ్ళకి తొడుక్కొని ఆ చేగోడీల్లాంటి వాటిని కొరుక్కు తింటూంటే, తెరకి పదడుగుల దూరంలో కూర్చుని చిరంజీవి సినిమా చూసినంత థ్రిల్లింగ్‌గా ఉండేది.

అయితే అవి చాలా ఖరీదు. ఐదు పైసలకి ఐదు ఇచ్చేవారు.

కొన్ని రోజులైన తర్వాత, వాటిని ఇంట్లోనే ఎందుకు తయారు చేయకూడదని ఒక ఆలోచన వచ్చి, నేనూ నా మిత్రుడూ కలిసి వాళ్ళ ఇంట్లో ఎవరూ లేనప్పుడు మూకుడు పెట్టి బోర్లంత నూనె పోసి, మొక్కజొన్న పిండితో వాటిని తయారు చేయటానికి ప్రయత్నించాము. అయితే వాడాల్సిన పిండి అది కాదు. అప్పడాల పిండి. దాంతో అన్నీ ఉండలుగా తయారయ్యాయి.

మేం పెట్టిన పెట్టుబడికి చాలా ఉండలు రావటంతో గొప్ప విజయం సాధించిన వాళ్ళలా పొంగిపోయి తింటూ ఉండగా వాళ్ళ అమ్మ వచ్చింది. అప్పుడు నా స్నేహితుడి వీపు మీద వాతలు రింగులు తేలేలా ఆవిడ కొట్టిన విధానం చూసిన తర్వాత, రింగుల మీద ఆసక్తి పూర్తిగా పోయింది. జీవితంలో మళ్ళీ ఎప్పుడూ వాటిని తినలేదు.

ఈ విషయం మా బావకి తెలిసి, "ఒరేయ్! నీలో ఒక వ్యాపారస్తుడు ఉన్నాడ్రా. పెట్టిన డబ్బుకు సరిపడా వస్తువు రాకపోతే, మనమే ఎలా తయారు చెయ్యాలన్న ఆలోచన రావటమే గొప్ప" అని(న్న) అర్థం వచ్చేలా మాట్లాడాడు.

వ్యాపారస్తుడు ఉన్నాడో లేదో తెలియదు కానీ అదృష్టవంతుడు మాత్రం నిశ్చయంగా ఉన్నాడు. ఆ రింగులు గానీ మా ఇంట్లో చేస్తూ అమ్మకి పట్టుబడి ఉంటే, ఈ వ్యాపార సూత్రాలన్నీ ఆ రోజే అటకెక్కి ఉండేవి.

# 6

మెట్లు జారే కొద్దీ, క్రింద నాచు ఎక్కువై మరింత వేగంగా అధఃపాతాళానికి జారిపోతాం. ఒకసారి జారటం మొదలయితే, ప్రకృతి కూడా దానికి దోహద పడుతుంది. రికామీగా ఉన్నాను కాబట్టి సినిమాలు చూడటం వ్యసనమైపోయింది. అలాంటి సమయంలో విధి సంకల్పం వల్లనేమో, మా ఊరికి ఒక సినిమా థియేటర్ వచ్చింది.

థియేటర్ అంటే హాలు కాదు. వీడియోలు కొత్తగా వచ్చిన రోజులవి. నాలుగు తడికెలు కట్టి, మధ్యలో టి.వి. పెట్టి కొత్త సినిమా కేసెట్లు తెప్పించి వేసేవారు.

రూపాయి టికెట్టు.

మొదట్లో కొన్ని రోజులు టికెట్టు కొనుక్కుని చూశాము. మేము చూడకుండా ఏ సినిమా కూడా ఊరి నుంచి వెళ్ళేది కాదు. కొంత కాలమైన తర్వాత నేను మా స్నేహబృందం తరఫు ప్రతినిధిగా వెళ్ళి, ఆ సినిమా హాలు(!?) ప్రొప్రయిటర్తో "...రెగ్యులర్ కస్టమర్లమయిన మా దగ్గర కూడా మీరు డబ్బులు వసూలు చేయటం భావ్యం కాదు" అన్నాను వినమ్రంగా.

"మరేం చెయ్యాల్ట?"

"కన్సెషను కావాలి"

"నువ్వేమైనా సేల్స్ టాక్సా? పోలీసు స్టేషనా?"అన్నాడు వెటకారంగా.

"అదయితే ఫుల్ ఫ్రీ కదా"

"జోకులెయ్యకు. మరోసారి ఇలా వస్తే కాళ్ళు విరక్కొడతా" అన్నాడు.

మరుసటి రోజు సాయంత్రం, ఇంకో రెండు నిముషాల్లో సినిమా ప్రారంభం అవుతుందనగా ఊరికి దూరంగా వెళ్ళి కరెంటు తీగల మీదకి సైకిల్ చైను విసిరేసాను. చిన్న శబ్దంతో మొత్తం ఊరంతా కరెంటు పోయింది.

అరగంట ఆగి హాలు దగ్గరకి వచ్చి చూసేసరికి, నేను ఊహించినట్టే హాల్ యజమాని బిక్క మొహం వేసుకుని ప్రేక్షకులకి టిక్కెట్టు డబ్బులు వెనక్కి ఇచ్చేస్తూ కనబడ్డాడు.

నేను కూడా అమాయకంగా మొహం పెట్టి అక్కడి నుంచి జారుకున్నాను.

మరుసటి రోజు కూడా అలానే జరిగేసరికి యజమానికి ఏం జరుగుతూందో అర్థమయ్యింది.

లైన్‌మెన్ల ద్వారా తన అనుమానం నిజమని నిర్ధారించుకున్నాడు.

ఆ థియేటర్ పెట్టిన వాడు మా ఊరివాడు కాదు. మమ్మల్ని ఏమీ అనలేదు. చైను ఎవరు వేసారో ఋజువు చేయటానికి లైన్‌మెన్లు పోలీసులు కాదు కదా. అందువల్ల మా మీద నేరం నిరూపించలేదు.

మరో రెండ్రోజులు అలా సాగితే, తను వీడియో సినిమా ప్రారంభించగానే ఊరంతా కరెంటు పోతోంది కాబట్టి, తన వీడియో వల్లే ఆ విధంగా జరుగుతుందని మేము ఒక రూమరు వ్యాప్తి చేస్తే, ఆ ఊళ్ళోనే కాదు, చుట్టు పక్కల ఏ ఊళ్ళోనూ తనకి పుట్టగతులు ఉండవన్న ప్రమాదాన్ని గ్రహించి, మాతో రాజీకొచ్చాడు.

మా బ్యాచ్‌కి కన్సెషన్ ఇచ్చే ప్రతిపాదిక మీద మేము అతన్ని మా ఊరిలో సినిమా నడుపుకొనే వీలు కల్పించాం.

అంతవరకూ విజయమే కానీ, ఆ కన్సెషను డబ్బు సంపాదించటం ఎలా?

దానికో మార్గం దొరికింది.

ఆ చుట్టుపక్కల విపరీతమైన తేనెపట్లు ఉండేవి. అర్ధరాత్రి వెళ్ళి మంట వెలిగించి తేనె తీసేవాళ్ళం. చాలా రిస్క్‌తో కూడిన పని అది. కానీ వ్యసనం మనిషిని ఎంత రిస్క్‌కైనా పురికొల్పుతుందనడానికి మా చర్యలే నిదర్శనం.

కొంత కాలానికి చుట్టుపక్కల తేనె పట్లు అయిపోయాయి.

ఈ సినిమాల జాడ్యం మమ్మల్ని దొంగతనానికి పురికొల్పింది.

పల్లెటూళ్ళలో కరెంటు పోల్‌కీ, పొలాల్లో మోటర్‌కీ దాదాపు ఎనభై మీటర్లు దూరం ఉండేది. చేతులకి గ్లౌసులు వేసుకొని ఆ కరెంటు వైర్లు కత్తిరించేవారం. వాటిని దూరపు ఊళ్ళు తీసుకెళ్ళి అమ్మేవారం. మీటరుకు ఎనిమిది రూపాయలు ఇచ్చేవారు.

అయితే ఇది చాలా రిస్కుతో కూడిన వ్యవహారం.

మా స్నేహితులు బాగా భయపడేవారు.

అప్పుడు నాకు ఒక ఫ్లాష్ లాంటి ఆలోచన వచ్చింది.

ఆ రోజుల్లో కరెంటు ఫ్లక్చుయేషన్స్ వల్ల బల్బులు తెగ మాడిపోయేవి.

మాకు వరసకు దూరపు(del) మామయ్య పట్నం నుంచి బల్బులు తెచ్చి అమ్మేవాడు.

అర్ధరాత్రి వెళ్ళి ఇళ్ళ వసారాల్లో, పక్క వరండాల్లో, వెనుక పెరట్లో ఉండే బల్బులు తొలగించి, మా దగ్గరున్న కాలిపోయిన బల్బులు పెట్టేవాళ్ళం. కరెంటు ఎగుడు దిగుడు వల్ల బల్బులు పాడయ్యాయని ఇళ్ళల్లో వాళ్ళు అనుకొనేవాళ్ళు.

ఇలా తొలగించిన బల్బులు బాగా కడిగి ఆయనకు అమ్మేవాళ్ళం. బల్బుకు మూడున్నర ఇచ్చేవాడు.

ఈ పుస్తక ప్రారంభంలో నేను 'నికృష్టమైన జీవితం' అనే ఒక పదం వాడాను. ఇంతకన్నా గొప్ప ఉదాహరణలు ఇంకా ఏం కావాలి?

నా జీవితం ఇలా ఎత్తుపల్లాల అస్తవ్యస్తపు బ్రతుకుబాటలో చక్రం విరిగిన ఎద్దుల బండిలా నడుస్తూ ఉండగా, మరో వైపు నుంచి ఒక అనుకోని సంఘటన జరిగింది.

మా చిన్న అన్నయ్య ఇంట్లోంచి పారిపోయాడు.

# 7

పెద్దన్నయ్య విడిపోవటం, చిన్నన్నయ్య ఇంట్లోంచి పారిపోవటం, ఈ రెండు సంఘటనలూ అమ్మ మీద పెద్ద ప్రభావాన్ని చూపించాయి. పైకి కనపడేది కాదు కానీ, లోలోపల చాలా బాధ పడేది.

పగలు బాగానే ఉండేది కానీ ఒక్కోరోజు అర్ధరాత్రి పూట చిన్నన్నయ్య గుర్తొచ్చి నిద్రలోంచి లేచి బిగ్గరగా ఏడవడంతో నాకు మెలకువ వచ్చేది. ఏమి చెయ్యాలో తోచక, తననే చుస్తూ ఉండేవాణ్ణి.

తాను అంత గట్టిగా ఏడుస్తూ ఉంటే నాకు భయం వేసేది. ఓదార్చటం తెలీదు. పక్కన కూర్చుని నేనూ ఏడుస్తూ ఉండేవాడ్ని.

మా పెద్దన్నయ్య మా నుంచి విడిపోయాడని ముందే చెప్పాను కదా..! తను పక్కింట్లో ఉండేవాడు. ఆ ఏడుపులు విని అర్ధరాత్రి వచ్చి అమ్మను ఓదార్చేవాడు.

మా చిన్న అన్నయ్య మనస్తత్వం చాలా విచిత్రమైనది. వాడు మాటిమాటికీ ఇంట్లోంచి (పారి/వెళ్ళి)పోయేవాడు. మూణ్ణాలుగు నెలలు ఎక్కడుండేవాడో కనబడేవాడు కాదు. హొటల్స్‌లో క్లీనర్‌గా, సర్వర్‌గా పనిచేసేవాడు. పోలీస్ రిపోర్ట్ కూడా ఇచ్చేవారం కాదు. అది పరువుకి సంబంధించిన విషయం. ఇప్పుడున్న సెల్‌ఫోన్‌లు ఆరోజుల్లో లేవు. మేమే చుట్టుపక్కల ఊళ్ళన్నీ వెతికేవాళ్ళం.

ఎక్కడో దొరికే వాడు. తీసుకొచ్చేవాళ్ళం.

కొన్నాళ్ళుండి మళ్ళీ వెళ్ళిపోయేవాడు. ఈ రకంగా వాడి జీవితం అస్తవ్యస్తంగా గడిచింది.

. . .

అమ్మ బాగా కష్టపడేది. అందరు పిల్లల్నీ పైకి తీసుకురావడం, ముగ్గురు కూతుళ్ళ పెళ్ళి చేయటం అంటే మాటలు కాదు.

పొద్దున్నే నాలుగు గంటలకు లేచి వంట చేసి, పనివాళ్ళకి కూడా తనే కూరలు వండి, తోడుగా నన్ను తీసుకొని పొలానికి బయలుదేరేది.

పొలం పనులకి కూలీలు వీలైనంత ఆలస్యంగా రావటానికి ప్రయత్నిస్తారు. అందుకని తనే ఇంటింటికీ వెళ్ళి, దాదాపు ఇరవై మందిని పోగేసేది.

లోపల్నుండి వాళ్ళు "ఇంకా వంట కాలేదమ్మా" అన్నప్పుడు, "అక్కర్లేదురా. మీక్కూడా నేను చేసి తీసుకొస్తున్నాను" అని చెప్పేది. దాని వల్ల సూర్యుడు పైకి రాకముందే అనుకున్న సమయానికి ఠంచనుగా పని ప్రారంభమయ్యేది.

కలుపు మొక్కలు తీసేటప్పుడు, తను రెండు వరుసలు తీసుకొని, మిగతావి కూలీలకి అప్పగించేది. అందరికన్నా ముందే తన రెండు వరసలూ పూర్తిచేసి మిగతావారిని తొందరపెట్టేది. అదే విధంగా పనులన్నీ అయిపోయి కూలీలు వెళిపోయాక, అనుకున్న పని సరిగా జరిగిందో లేదో పదినిముషాల పాటూ  చూసుకొని వెళ్ళేది. అన్నం ముట తెచ్చుకోని వాళ్ళకి తనే భోజనం పెట్టేది.

దీని నుంచి నేను కొన్ని పాఠాలు నేర్చుకున్నాను.

నా భవిష్యత్-జీవితంలో అవి  చాలా ఉపయోగకరంగా పరిణమించాయి.

మొదటిది, ఇతరులతో పని చేయించే వ్యవహారాల్లో, అందరికన్నా ముందు మనం అక్కడ ఉండాలి..!

నా ఇన్‌స్టిట్యూట్‌లో కూడా నేను కూడా అదే అమలు జరిపాను. అందరికన్నా ముందు వెళ్ళటం, అసిస్టెంట్స్ అందరూ వెళ్ళిపోయిన తర్వాత, ఆ రోజు పని ఎలా జరిగిందా అని చూసుకుని, మరుసటి రోజు చేయవలసిన పనులని ఒక క్రమపద్ధతిలో పెట్టుకుని, అప్పుడు ఇంటికి వెళ్ళటం.

రెండో విషయం ఏమిటంటే, పని చేసేవారిని మనం బాగా చూసుకుంటే సంస్థ పట్ల వారికి అభిమానం పెరుగుతుంది. ఎవరికో పని చేస్తున్నామని కాకుండా, మనందరం కలిసి చేస్తున్నామనే ఆత్మీయ భావన ఎక్కువ అవుతుంది.

అన్నిటి కన్నా ముఖ్యవిషయం ఏమిటంటే పనివారి కన్నా మనం ఏక్టివ్‌గా ఉండాలి..! పని చేసి చూపించాలి..!! దాంతో వారిలో పోటీ మనస్తత్వం పెరుగుతుంది. అంతర్గత శక్తి బయట పడుతుంది.

ఇదంతా చేయటం వల్ల నాకు 'పని రాక్షసుడు' అన్న బిరుదు వచ్చిందని తెలుసు. అందులో చిత్రమేమీ లేదు.

పని రాక్షసి కడుపున రాక్షసుడు పుట్టక దేవత పుట్టదు కదా.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)